క్లుప్తంగా

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి



రెంజల్(బోధన్): భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో రెంజల్ తహసీల్దార్‌ను ఆదేశించారు. శుక్రవారం కార్యాలయాన్ని సందర్శించి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను విచారించి పరిష్కరించేందుకు తన కార్యాలయానికి పంపించాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు సూచించారు.

క్షయవ్యాధి రహిత సమాజం కోసం కృషి



బోధన్: క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తున్నామని సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 15మంది రోగులకు నిత్యావసరుకుల పంపిణీ చేశారు. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసం బోగస్ ఆరోపణలు



రుద్రూర్: రాజకీయ లబ్ధి పొందడానికి బీఆర్ఎస్ నాయకులు బోగస్ ఆరోపణలు చేస్తున్నారని కోటగిరి మాజీ జెడ్పీటీసీ శంకర్ పటేల్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బోగస్ బోనస్ తీసుకున్నట్లు నిరూపిస్తే డబ్బులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మెన్ ఎన్. గంగాధర్, హంగర్గా మాజీ సర్పంచ్ ఎజాజ్‌ఖాన్, సంతోష్, రఫీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ గ్రామంలో బాధితురాలికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందించారు. గ్రామానికి చెందిన చింతకుంట కవితకు రూ.13వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంద మహిపాల్ అందించారు. నాయకులు గొజ్జి రాజేందర్, గొజ్జి కిషన్, మల్లేష్, చిన్నారెడ్డి, గాదరి లింగం, పీరాజీ నాగరాజ్, చందు, తదితరులు పాల్గొన్నారు.

మాలల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లాలి

పెర్కిట్(ఆర్మూర్): మాలలు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకెళ్లాలని మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్దామని ఆలూర్ మండల మాల మహానాడు అధ్యక్షుడు అగ్గు క్రాంతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాల మహానాడు సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించనున్న సమావేశానికి మంత్రి వివేక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హాజరవుతున్నట్లు తెలిపారు. మాల మహానాడు నాయకులు పెండ ఉదయ్, చిట్టీ బాబు, పిట్ల శోభన్, శ్రీనివాస్, గంగాధర్, సజన్, మహిపాల్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై అవగాహన



రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరి పంటలో ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ కం సీడర్ వాడకంతో నేరుగా వరి విత్తడం, తడి-పొడి పద్ధతితో నీటి యాజమాన్యం వంటి ఉపయోగాల ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. ఈపద్ధతుల ద్వారా కూలీల ఖర్చు రూ. ఎనిమిది వేల వరకు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్ కుమార్, వ్యవసాయాధికారిణి నిశిత, ఏఈవో సుప్రియ, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ గణేష్ సాగర్, ప్రశాంత్,అరుణ్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు
- నందిపేటలో అధ్వానంగా పారిశుద్ధ్యం
- దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతి



నందిపేటలో చికిత్స పొందుతున్న బాధితురాలు



నందిపేటలో నిలిచిన మురుగు నీరు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖాళీస్థలాలు, ఇళ్ల మధ్య నీరు నిలువడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో దోమ కాటుతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. మండల కేంద్రమైన నందిపేటలో మొత్తం 16 వార్డులు ఉండగా జనాభా సుమారు 16 వేల వరకు ఉంటారు. ఒక్కో వార్డులో 1000 నుంచి 1100 మంది వరకు ఉంటారు. ఇటీవల వర్షాలకు వార్డుల్లో పారిశుద్ధ్యం లోపించింది. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలో అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

ఆస్పత్రులకు క్యూ కడుతున్న జనం..

నందిపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి వంద మందికి పైగా జ్వరాల బారిన పడినట్లు గుర్తించారు. ప్రస్తుతం రోజురోజుకు జ్వర పీడితులు సంఖ్య పెరుగుతుంది. మండల కేంద్రంలో ఇప్పటికే వందకి పైగా జ్వరాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆరోగ్య పరంగా, ఆర్థికంగా నష్టపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది..

వార్డులో పారిశుద్ధ్యం పేరుకుపోతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఇళ్ల స్థలాల మధ్య ఉన్న మురికి గుంటలు, ఖాళీ స్థలాలలో నిలిచిన నీరు, చెత్తచెదారం దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు నందిపేటలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



నందిపేటలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నీరు చెత్తచెదారం నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నారు. దీంతో జ్వరాలు బారిన పడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన పట్టించుకోవడం లేదు.

– కస్తూరి గంగాధర్, నందిపేట

సమస్యలు పరిష్కరించాలి



నందిపేటలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇళ్ల మధ్య చెరువును తలపించేలా నీరు నిలుస్తుండడంతో దోమలు పెరుగుతున్నాయి. అధికారులు స్పందించి వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి.

–తొంటి శ్రీనివాస్, నందిపేట

చర్యలు తీసుకున్నాం

జ్వరాలు తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకున్నాం. నందిపేట పీహెచ్‌సీకి జ్వరాలతో వచ్చే వారికి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టాం.

– ప్రవీణ్, మండల వైద్యాధికారి, నందిపేట

పారిశుద్ధ్య చర్యలు చేపడుతాం

నందిపేటలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఓపెన్ ప్లాట్లలో నిలిచిన నీరు తొలగించాలని యజమానులకు సమాచారం ఇచ్చాం.దోమల నివారణకు పంచాయతీ సిబ్బంది శా నిటేషన్ చేస్తున్నారు. స్థానిక అధికారులు దగ్గరుండి సమస్య పరిష్కరించేలా చూస్తాం. – శ్రీనివాసరావు, ఎంపీడీవో, నందిపేట

ప్యాడి డ్రయ్యర్ యంత్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బోధన్ : ప్యాడి డ్రయ్యర్ యంత్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్ అన్నారు. ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సూచన మేరకు మార్కెట్ కమిటీ ద్వారా రూ. 13 లక్షల 10లతో కొత్త ప్యాడి డ్రయ్యర్ యంత్రాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయం ఆవరణలో కొత్త యంత్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ ఈ యంత్రం గంటకు 30 క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని ఆరబెడుతోందన్నారు. వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ శరత్, ఏఎంసీ కార్యదర్శి జి.భారతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి,కృష్ణారెడ్డి, భూమయ్య, గంగారెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్యాడి డ్రయ్యర్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, ఉద్యోగులు

సంక్షిప్తం

ప్రయోగశాల పరికరాల వితరణ

బాల్కొండ: బాల్కొండ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు ప్రయోగశాల పరికరాలను పారిశ్రామిక వేత్తా ఏనుగు దయానంద్‌రెడ్డి అందించారు. పరికరాలు, అన్ని సబ్జెక్ట్‌ల చార్ట్‌లు, మెడల్స్, ఫర్నిచర్ శుక్రవారం పాఠశాలకు చేరాయి. ఎస్‌వో భవాని, విద్యార్థులు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

వర్ని: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండలంలోని పాత వర్ని గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సొసైటీ డైరెక్టర్ గంగప్ప,మాజీ ఎంపీటీసీ నాగభూషణం, సుఖం వీరయ్య, పెద్దపుల శ్రీనివాస్, జంగం రాజప్ప, భద్రప్ప, మొండి సాయిలు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

బోధన్: ప్రతి ఉద్యోగి సమాచార హక్కు చట్టం -2005పై అవగాహన కలిగి ఉండాలని సాలూర మండల తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో గ్రామ స్థాయి ఉద్యోగులకు అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి నిర్ణీత గడువులోగా సమాచారం ఇవ్వాలన్నారు. వివిధ శాఖల అధికారులు , ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో పారిశుద్ధ్య పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ పరిశీలించారు. పట్టణంలోని 22, 23,24,34 వార్డుల్లో పర్యటించి పనులను పరిశీలించారు.చెత్తను బయట పారవేయకుండా చెత్త బుట్టలో వేయాలని ప్రజలకు సూచించారు.

మంత్రి సీతక్కను కలిసిన రిటైర్డు ఎంపీఐ



వేల్పూర్: వేల్పూర్ మండలం లక్కోర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, రిటైర్డు ఎంపీఐ ఉట్నూ రు సుభాష్ శుక్రవారం నిజామాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సుభాష్‌ను మంత్రి సీతక్కకు పరిచయం చేశారు.

జీపీవోల నూతన కార్యవర్గం

మాక్లూర్ : మండల జీపీవోల కార్యవర్గాన్ని మండల కేంద్రంలో శుక్రవారం ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా సుంకరి జీవన్, అధ్యక్షుడిగా బియ్యి సాయినాథ్, ప్రధాన కార్యదర్శిగా డి.సృజన్, ఉపాధ్యక్షులుగా బేగరి బద్దెన్న, కోశాధికారిగా మధుసూదన్, ముఖ్య సలహాదారులుగా కే.గంగారాం, జే గంగాధర్, కార్యవర్గ సభ్యులుగా కిరణ్, నవనీత, గంగాధర్, సుమన్, అనురాధ, గంగారాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు సుంకరి జీవన్ తెలిపారు.

సమయానికి రాని బస్సుతో ఇబ్బందులు

వేల్పూర్: వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సకాలంలో రాక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వచ్చేదే రెండు ట్రిప్పులు. అది కూడా గంట ఆలస్యంగా వస్తోందని, దాంతో తమ పిల్లలు వన్నెల్ బి స్కూలుకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు సమయానికి బస్సు నడపాలని వారు కోరుతున్నారు.

కేటీఆర్, హరీష్‌రావులను కలిసిన షకీల్ దంపతులు



బోధన్: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులను శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్, ఆయన సతీమణి అయేషా ఫాతిమా, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే,పార్టీ జిల్లా ప్రెసిడెంట్ ఆశన్నగారి జీవన్ రెడ్డి కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు కలిశారని స్థానిక పార్టీ నాయకులు తెలిపారు.

ముగిసిన మండల స్థాయి క్రీడలు

రుద్రూర్: మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి అంతర పాఠశాల క్రీడలు శుక్రవారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఓవరాల్ చాంపియన్‌గా మోడల్ స్కూల్ విద్యార్థులు నిలిచారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి కట్ట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, సింగిల్ విండో మాజీ చైర్మెన్ పత్తి రాము, పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు విఠల్ రెడ్డి, తపస్ మండల అధ్యక్షుడు గోనె శంకర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజక వర్గ అధ్యక్షుడిగా రమేశ్‌దాస్

బోధన్: బహుజన సమాజ్ పార్టీ బోధన్ నియోజక వర్గ అధ్యక్షుడిగా పట్టణ కేంద్రానికి చెందిన యువ నాయకుడు రమేశ్‌దాస్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగాడే పాండు శుక్రవారం తెలిపారు.పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాంకృష్ణ, ప్రతినిధి నీరడి ఈశ్వర్‌లు ఆయన నియామక పత్రాలు అందించారని పేర్కొన్నారు.

బడాభీమ్‌గల్ రోడ్డు మరమ్మతులు ప్రారంభం

మోర్తాడ్: భీమ్‌గల్ నుంచి బడాభీమ్‌గల్‌కు వెళ్లే మార్గంలో ఉన్న రోడ్డు భారీ వర్షాలకు దెబ్బతినగా వాటి మరమ్మతు పనులను శుక్రవారం ప్రారంభించారు. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు బొదిరె స్వామి, జేజే నర్సయ్య, కన్నె సురేందర్‌రెడ్డి, మల్లెల లక్ష్మణ్, దేవేందర్, వాక మహేష్, ఆరె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల నిరసన



వర్ని(మోస్రా): మండలంలోని గోవూరు శివారు నుంచి మోస్రా శివారు వరకు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మోస్రా వద్ద రోడ్డుపై బైఠాయించి సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనులు నత్త నడకన సాగుతుండడంతో గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దుమ్ముతో వాహనదారులు తిప్పలు పడుతున్నారని సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ఆరోపించారు. కనీసం వాటర్ ట్యాంకర్లతో రోడ్డుపై నీళ్ల పిచికారి చేసి దుమ్మును అరికట్టాలని కోరారు.కార్యక్రమంలో మండల కార్యదర్శి మేకల మల్లేష్, స్థానికులు గంగా ప్రసాద్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మానసిక ధైర్యాన్ని కోల్పోవొద్దు



కమ్మర్‌పల్లి: విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే చదువుతో పాటు క్రీడల్లో రాణించగలుగుతారని కమ్మర్‌పల్లి పీహెచ్‌సీ నోడల్ ఆఫీసర్ పద్మలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు ఎలాంటి సందర్భంలోనైన మానసిక ధైర్యాన్ని కోల్పోవద్దని, సానుకూల దృక్పథంతో చదువుకోవాలని సూచించారు. అధ్యాపకులు మధు, రాజ్ కుమార్, వైష్ణవి, వెంకటేశ్, గంగాధర్, మురళీకృష్ణ, స్వాతి, స్రవంతి, ఏఎన్ఎంలు కృష్ణవేణి, స్వరూప, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఫిర్యాదు

రుద్రూర్ : మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని ముస్లిం నాయకులు శుక్రవారం రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్ ఇండోర్ లో జరిగిన ఒక కార్యక్రమంలో ముస్లింల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించారని పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ఉప్లూర్‌లో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహిస్తున్న సీడీపీవో స్వర్ణలత

కమ్మర్‌పల్లి/బోధన్‌టౌన్ : గర్భిణులు, బాలింతలు, సాధారణ మహిళలు నిత్యం పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ భీమ్‌గల్ సీడీపీవో స్వర్ణలత అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ గంగహంస పాల్గొన్నారు. పట్టణంలోని రాకాసీపేట్, శక్కర్‌నగర్ సెక్టార్‌లలో గల అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణుల సీమంతం చేశారు.ఈ కార్యక్రమానికి సీడీపీవో పద్మ హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు రాధిక, ఆసియా, జిల్లా మహిళా సాధికారిక కేంద్రం కో– ఆర్డినేటర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అత్యుత్సాహమే వివాదానికి కారణం

- అటవీ, రెవెన్యూ శాఖ అధికారులను సంప్రదించకుండానే సిద్దాపూర్ రిజర్వాయర్ డీపీఆర్ రూపకల్పన
- శాఖల మధ్య సమన్వయ లోపం



రిజర్వాయర్ నిర్మాణం చేపడుతున్న స్థలం

వర్ని: మండలంలోని సిద్దాపూర్ అటవీ ప్రాంతంలో నిర్మాణం చేపడుతున్న రిజర్వాయర్ లో భూ వివాదానికి అధికారుల అత్యుత్సాహమే కారణమైంది. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు ఇరిగేషన్ అధికారులు అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు సంప్రదించకుండానే డీపీఆర్ రూపొందించారు. దీంతో రెండు శాఖల మధ్య ఈవివాదం తలెత్తింది. ప్రాజెక్టు నిర్మించే ప్రాంతంలో అటవీ శాఖకు చెందిన 21 ఎకరాల భూమి ఉందని తమ అనుమతులు లేకుండా ఎలా నిర్మాణం చేపడతారని అటవీశాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు. పాత ప్రాజెక్టు ప్రాంతంలోనే కొత్త ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నామనీ కొత్తగా అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని రెవెన్యూ అధికారులు వాదిస్తున్నారు. రెండు శాఖల అధికారుల సమన్వయం లేకపోవడంతో ఈవివాదం తలెత్తింది. సిద్దాపూర్ రిజర్వాయర్ ను రూ. 121 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపడుతున్నారు. ప్రాజెక్టు పూర్తయితే 32 గ్రామాల రైతులకు సాగునీరు అందనుంది. 3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే రిజర్వాయర్‌తో ఆయకట్టు కింద పదివేల ఎకరాలు సాగు అవుతుందని అధికారులు వెల్లడించారు.

జాయింట్ సర్వేతో పరిష్కరిస్తాం

ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో 21 ఎకరాల స్థలం విషయంలో వివాదం నెలకొంది. రెవెన్యూ అటవీ శాఖ అధికారుల జాయింట్ సర్వే తో 15 రోజుల్లో ఈవివాదాన్ని పరిష్కరిస్తాం.

– శ్రీనివాస్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్,బోధన్

రెవెన్యూ భూమి ఇవ్వటానికి సిద్ధం

అటవీ శాఖ అధికారులు చెబుతున్నట్లు 21 ఎకరాల అటవీ భూమి ప్రాజెక్టులో కలిస్తే దానికి బదులుగా రెవెన్యూ భూమిని ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాం. ఇరు శాఖల అధికారుల జాయింట్ సర్వే తర్వాత ఆ భూమి అటవీ శాఖ దే అని తేలితే ప్రభుత్వానికి నివేదిక పంపి సరిపడా భూమిని అటవీశాఖ అధికారులకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– సాయిలు, తహసీల్దార్, వర్ని

అనుమతులు తీసుకోవడం తప్పనిసరి

కొత్త ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నప్పుడు అటవీ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవడం తప్పనిసరి. సంబంధిత శాఖ అధికారులు తమ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. తమ వద్ద ఉన్న రికార్డుల పరిశీలనలో భాగంగా ప్రాజెక్టు నిర్మాణంతో 21 ఎకరాల అటవీ భూమిని శాఖ కోల్పోతుంది.

– గంగాధర్, ఎఫ్ఆర్వో, వర్ని

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పెర్కిట్ విద్యార్థులు



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు



అండర్-14 కబడ్డీ జిల్లా స్థాయి బాల, బాలికల జట్లతో ఎంఈవో

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్-14, అండర్-17 విభాగంలో జోనల్ స్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో పెర్కిట్ పాఠశాలకు చెందిన ప్రేమ్ లాల్, ఆర్టి కుమార్, రాహుల్, హనీష్ తేజ, వాలీబాల్ పోటీల్లో మిథున, సుజాత ఉత్తమ ప్రతిభతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు జిల్లా కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్ఎం శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయి బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక..

బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శుక్రవారం అండర్- 14 కబడ్డీ ఎస్‌జీఎఫ్ క్రీడ జిల్లా బాల, బాలికల జట్లను ఎంపికచేశారు. ఈసందర్భంగా ఎంఈవో రాజేశ్వర్ మాట్లాడుతూ.. బాల్కొండ జోనల్ కబడ్డీ, జిల్లా స్థాయి జట్లను బాల్కొండలో ఎంపిక చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ జట్లు ఈనెల 13 నుంచి జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వరంలో జిల్లా కేంద్రంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీడీ రాజుకుమార్, పీఈటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బీసీల ధర్నా



మోస్రాలో ధర్నా చేస్తున్న నాయకులు

వర్ని (మోస్రా): మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం బీసీలు ధర్నా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రిజర్వేషన్ల పేరుతో బీసీలకు కాంగ్రెస్‌పార్టీ అన్యాయం చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షులు అంగోల శ్రీకాంత్ ఆరోపించారు.మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్‌గౌడ్,నాయకులులింగం,జయరాం,అనిల్, రాజు,శ్రీను,శ్యామ్,ధర్మేందర్,సాయిలు పాల్గొన్నారు.

బీసీ సమాజ మంతా ఏకం కావాలి..

బాల్కొండ: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సమాజమంతా ఏకం కావాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం చేయాలన్నారు.

దళారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దు



చింతకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

వర్ని/రెంజల్/మోర్తాడ్ : ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని మోస్రా ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని చింతకుంట, తిమ్మాపూర్, గోవూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఎంపీడీవో ప్రారంభించారు.రెంజల్ మండలం అంబేడ్కర్‌నగర్, రెంజల్, నీలా, బోర్గాం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లై బోధన్ డివిజన్ డీటీ మహేష్‌కుమార్, ఐకేపీ ఏపీఎం మోహన్‌లు ప్రారంభించారు.భీమ్‌గల్ సహకార సంఘం ఆధ్వర్యంలో నందిగల్లీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ శివసారి నర్సయ్య ప్రారంభించారు.

కెపాసిటర్లతో విద్యుత్ ఆదా

మాక్లూర్: వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకుంటే విద్యుత్ ఆదా అవుతుందని నిజామాబాద్ విద్యుత్ శాఖ డీఈ రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్ర పల్లి గ్రామంలో విద్యుత్ సిబ్బంది నిర్వహించిన పొలం బాట కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాక్లూర్ ఏఈ మిథున్, లైన్‌మన్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, రైతులు ఉన్నారు.